క్లుప్తంగా

నేటినుంచి పశువులకు ఉచిత వైద్యశిబిరాలు

కొయ్యలగూడెం: పశువులకు సోమవారం నుంచి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాల్లో పశువులకు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు కొయ్యలగూడెం పశువైద్యశాల వైద్యాధికారి బీఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కొయ్యలగూడెం –జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఏఎంసీ యార్డ్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. 21వ తేదీన యర్రంపేట, బయ్యన్నగూడెం, 22న సీతంపేట, మంగపతిదేవిపేట, 23న గవరవరం–1, 24న గవరవరం –2, రాజవరం, 25న దిప్పకాయలపాడు, పరింపూడి–3, 26న పరింపూడి–2, 27న కన్నాపురం –1, అచ్యుతాపురం, 28న వేదాంతపురం, రామానుజపురం, కన్నాపురం–2, 30న రాజవరం, పొంగుటూరు, 31న బోడిగూడెం, గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రైతులు, పశువుల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పోరాటాలు

చింతలపూడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అహర్నిశలు పోరాడుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. రేచర్ల గ్రామ శాఖ మహాసభ ఆదివారం డి తిరుపతయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గురవయ్య మాట్లాడుతూ ఇటు ప్రజా పోరాటంలో అటు చట్టసభల్లో సీపీఐ నిర్వహించిన పాత్ర గణనీయమైనదని చెప్పారు. మహాసభలో వన సంరక్షణ సమితి సభ్యులకు ఒక హెక్టార్ భూమితో పాటు వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అదే విధంగా రేచర్ల వాటర్ ట్యాంక్ నుంచి కృష్ణుడు గుడి వరకు ఉన్న రోడ్డును సిమెంట్ రోడ్డు వేయాలని సభలో తీర్మానించారు. మహాసభలో ఇటీవల చనిపోయిన జమ్మి శ్రీనివాస్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం శాఖ కార్యదర్శిగా ఇస్తరాకులు వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మార్చి 29, 30 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్

జంగారెడ్డిగూడెం: మార్చి 29, 30 తేదీల్లో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల పరిధిలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కాసర నర్సిరెడ్డి కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి తిప్పాబొట్ల రామకృష్ణ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే 17వ వార్షికోత్సవ, ఉగాది వేడుకల కరపత్రాన్ని ఆదివారం స్థానిక ఎంటీ సోషల్ క్లబ్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి రూ.10వేలు,రెండవ బహుమతి రూ.7 వేలు, 3వ బహుమతి రూ. 2వేలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే సాయంత్రం 6 గంటల నుంచి నృత్యాలు, నాటికలు, క్విజ్‌పోటీలు, గద్యపఠన పోటీలు నిర్వహిస్తామన్నారు.

నగరంలో తాగునీరు సురక్షితమేనా?

- ఎక్కడ చూసినా పైప్‌లైన్ల లీకులు
- మరమ్మతులు చేపట్టినా కొద్దికాలానికి అదే పరిస్థితి పునరావృతం
- కొత్త పైప్‌లైన్లు వేయాలంటున్న నగరవాసులు



కొత్తపేటలో డ్రెయినేజీ మీదుగా వేసిన తాగునీటి పైప్‌లైన్

ఏలూరు రూరల్ : నగరంలో ఎక్కడచూసిన తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు తారసపడుతున్నాయి. దీనికి తోడు ఈ పైప్‌లైన్లన్నీ డ్రెయినేజీకి సమీపంలో ఉండడంతో తాగునీరు కలుషితమవుతోందని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పైప్‌లైన్ల మరమ్మతులకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు చేసేది లేక డబ్బులు పెట్టి మరీ వాటర్‌ప్లాంట్ నీటిని ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా అందిస్తున్న నీరు కేవలం వాడకం కోసం ఉపయోగిస్తున్న పరిస్థితి తలెత్తింది. నగరంలోని సుమారు 40కు పైగా డివిజన్‌ల్లో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు.

ఎక్కడ చూసినా మరమ్మతులే..

ఏలూరు వన్‌టౌన్ గిలగిలగేటు, వపర్‌పేట, కొత్తపేట, తంగెళ్ళమూడి, రామచంద్రరావుపేట, నరసింహారావుపేట, పెన్షన్‌లైన్ తదితర ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్ పాతబడిపోయింది. ఈ ప్రాంతాల్లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి ప్రజల తాగునీరు సరఫరా అవుతోంది. అయితే అనేక ప్రాంతాల్లో పైప్‌లైన్లు తరచూ మరమ్మతులకు గురౌతున్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేస్తున్నప్పటికీ కొద్దిరోజుల్లో లీకేజీలు ఏర్పడుతున్నాయి. డ్రెయినేజీ వెంబడి ఉన్న పైప్‌లైన్లు లీకేజీ కావడంతో డ్రెయినేజీ నీటితో కలుషితమౌతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ఈ నీటిని తాగేందుకు ప్రజలు ఇష్టపడడం లేదు. 43, 45 డివిజన్ పరిధిలో కొత్తపేట, ఏకేజీ సెంటర్, నీల ట్యాంక్, గంగానమ్మ గుడి, చోదిదిబ్బ, కుస్తీలదొడ్డి తదితర ప్రాంతాల్లో డ్రెయిన్ నుంచి పైప్‌లైన్లు ఏర్పాటుచేశారు. అనేక వీధుల్లో పైప్‌లైన్ తుప్పు పట్టి పాడైపోయాయి. పలుసార్లు పైప్‌లైన్ నుంచి తాగునీరు లీకేజ్ అవుతోంది. సిబ్బంది మరమ్మతులు చేపట్టినప్పటికీ కొద్దిరోజులకు మళ్లీ లీకేజీ ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గిలకలగేటు రోడ్డులో ప్రధాన పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



డీమార్ట్ పరిసరాల్లో పైప్‌లైన్ లీకేజీ ఇలా

కొద్దిరోజులకే మళ్లీ లీకేజీలు



కొత్తపేట నీల ట్యాంక్ వద్ద పలు వీధుల్లో డ్రెయినేజీ మీదుగా తాగునీటి పైప్‌లైన్ వేశారు. పలు చోట్ల పైప్‌లైన్ తుప్పుపట్టి లీకేజీలు అవుతున్నాయి. ఇప్పటికే చాలా సార్లు తాగునీరు కలుషితమయియ్యింది. సిబ్బంది వచ్చి పైప్‌లైన్లకు మరమ్మతులు చేస్తున్నారు. కాని మళ్లీ కొద్దిరోజులకే లీకేజీ ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా పైప్‌లైన్ మార్చాలి.

– అతీఖ్, పెన్షన్‌లైన్

కొత్త పైప్‌లైన్ వేయాలి



గతంలో తాగునీటి కలుషితం కారణంగా నగరంలో ప్రజలు కళ్లు తిరగడం, వాంతులతో కూడిన వింత వ్యాధితో బాధపడ్డారు. అప్పటి నుంచి కార్పొరేషన్ నీళ్లు తాగాలంటేనే భయమేస్తోంది. కొత్తపైప్‌లైన్ వేస్తేనే ప్రజలు కార్పొరేషన్ నీళ్లు తాగేందుకు ఇష్టపడతారు. లేదంటే ఎంత ఖర్చు చేసి నీళ్లు సరఫరా చేసిన ప్రజలు వాటర్‌ప్లాంట్ నీళ్లే తాగుతారు.

– సుభాని, కత్తేపువీధి

కార్పొరేషన్ నీళ్లంటేనే భయం



నగరంలో ఎక్కడ చూసిన తాగునీటి పైప్‌లైన్లు డ్రెయి నేజీ పక్కనుంచే వేస్తున్నారు. కొన్నిచోట్ల తుప్పుపట్టిన పైప్‌లైన్ మీదగా మురుగునీరు పారుతోంది. ఈ కారణంగా కార్పొరేషన్ నీళ్లు తాగాలంటేనే భయమేస్తోంది. అందుకే ఈ నీళ్లు వాడకం కోసమే ఉపయోగిస్తున్నాం. రోజుకు రూ.40 ఖర్చు చేసి వాటర్‌ప్లాంట్ నుంచి నీళ్లు కొంటున్నాం.

– విజయమ్మ

పైప్‌లైన్లు తుప్పు పడుతున్నాయి

కుళాయి కోసం జింక్ కోటింగ్ ఉన్న ఐరన్ పైప్ ఉపయోగిస్తున్నారు. ఇది నాసిరకం కావడంతో త్వరగా తుప్పు పట్టిపోతున్నాయి. దీనివల్లనే పైప్‌లైన్ లీకేజీ అవుతున్నాయి. ఈ కారణంగా కార్పొరేషన్ నీళ్లు తాగేందుకు భయమేస్తోంది. లీకేజీ లేకుండా సురక్షిత తాగునీరు సరఫరా కావాలంటే అధికారులు మన్నిక కల్గిన పైప్‌లైన్ వేయాలి.

– అజీమ్, కత్తేపువీధి

జనార్దన స్వామికి 'కల్కి' అలంకరణ



శ్రీ కల్కి అవతార అలంకరణలో శ్రీ జనార్దన స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూనీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, విశేష అర్చన నిర్వహించారు. ఈసందర్భంగా జనార్దన గోష్ఠి ప్రతినిధులచే సహస్రనామ పారాయణ జరిపారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి శ్రీ కల్కి అవతార అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగమునేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఆదివారం దేవులపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: కోడిపందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వీరి నుంచి రూ.3450 నగదు, ఒక కోడి, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సీఆర్‌రెడ్డి కళాశాలలో కలిసిన 1978-80 బ్యాచ్ ఎం.కాం. విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సీఆర్ రెడ్డి కళాశాలలో 1978 – 80 సంవత్సరంలో ఎం.కాం విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాల క్యాంపస్‌లో రత్నబాబు వేముల పల్లి, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనాటి మధురస్మృతులను, జీవిత ప్రయాణంలో గడిపిన అనుభవాలను పంచుకున్నారు. అప్పటి పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యాపకుకులు కే శ్రీమన్నారాయణ, కేవీఆర్‌ఎస్ కొండయ్యరావు, షేక్ హుస్సేన్, ప్రొఫెసర్ పీ సుబ్బారావులను పుష్పగుచ్ఛాలు అందజేసి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అలాగే కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, ఏ.విజయకుమార్‌లను దుశ్శాలువ, పూలమాలలు, జ్ఞాపికలతో సన్మానించారు. లెక్చరర్స్ వారి సందేశాలను, వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. 44 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు ఇలా కలుసుకోవడం గొప్ప విశేషంగా అధ్యాపకులు అభినందించారు. అప్పటి మహిళా విద్యార్థినులు సైతం అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషదాయకమైన విషయమని, భవిష్యత్‌లో మరిన్ని కలయికలు నిర్వహించడానికి కృషి చేస్తామని నిర్వాహకులు రత్నబాబు, సాంబశివరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తాం

పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబికా రాజా



అంబికా రాజాను సత్కరిస్తున్న ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్, శ్రీనివాసరావు, జాన్‌గురునాథ్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ ఫలాలు అందుకుంటూ రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషంగా గడిపారని.. నేడు కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను నట్టేట ముంచిందని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు అంబికా రాజా అన్నారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడు అంబికా రాజాను సత్కరించారు. ఈ సందర్భంగా అంబికా రాజా మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనతో రాష్ట్రంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉంటే.. నేడు ప్రజలంతా పనులు లేక తినేందుకు తిండి లేక తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం తమ మంత్రులకు తమది మంచి ప్రభుత్వమనీ, ప్రజలకు ఎంతో చేశామని ప్రచారం చేయాలని చెప్పటం సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు అధికారం చేపట్టిన అనంతరం డబ్బులు లేవనీ.. సంక్షేమ పథకాలు అమలు చేయలేమని చెప్పటం వారి చేతకానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలలకే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వచ్చిందనే విషయాన్ని గ్రహించిన కూటమి ప్రభుత్వం ప్రజలను మాయ చేసేందుకు నెలకో కుట్ర చేస్తూ పబ్బం గడుపుతుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఏలూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు కిలాడి దుర్గారావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, పల్లి శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	01
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	0
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు – తిరుపతి	16.00	4830	24
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.10	98513	33
ఏలూరు–బీహెచ్‌ఈఎల్	22.30	98502	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	40	బిళ్లచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	30–38	చామదుంపలు	40
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	38	కంద	60
కాకర కాయలు	44	బీట్‌రూట్	48
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	50	పాలకూర	10
బంగాళదుంపలు	32–36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07
దోసకాయలు	30–36	పుదీనా	05
ఆనబకాయ (1)	20–30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44

సరస్వతికి సావిత్రిబాయి పూలే అవార్డు



సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు అందుకుంటున్న భరోతు సరస్వతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న భరోతు సరస్వతికి సావిత్రిబాయి పూలే అవార్డు లభించడం అభినందనీయమని ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్య నాగేశ్వరావు నాయక్, గుగ్గులోతు కృష్ణ నాయక్ ధారావతు కీమియా నాయక్, ధారావతు రాజబాబు నాయక్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరులో జరిగిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ సమావేశంలో అధ్యాపకురాలు సరస్వతికి సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభ అవార్డును ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యారంగంలో సరస్వతి చేస్తున్న సేవలకుగాను ఈ పురస్కారం అందించడం ఆమెకు లభించిన సముచిత గౌరవమని అన్నారు. సరస్వతి గిరిజన లంబాడి కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదుగుతూ లంబాడీల సాంస్కృతిక జీవన విధానం అనే అంశంపై పరిశోధన చేసి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందడం ఆమె ప్రతిభకు తార్కాణమన్నారు. ఈమె అనేక పరిశోధనలు చేసి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని గిరిజన లంబాడి నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఆంధ్రా కాలువను ఆదుకోరూ



పూడిక పేరుకుపోయి ముళ్లపొదలతో అధ్వానంగా ఉన్న చింతలపూడి మండలంలోని ఆంధ్రా కాలువ

చింతలపూడి: తెలంగాణ, ఆంధ్ర సరిహద్దులో చింతలపూడి మండలంలో ప్రవహిస్తున్న ఆంధ్రాకాలువను మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. వచ్చే వేసవిలో వర్షాకాలానికి ముందే పంటకాలువల పూడిక తీసి బాగు చేసుకుంటే సాగునీరు చివరి పొలాలకు కూడా చేరడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. గత ఏడాది ఆయకట్టు రైతుల వినతి మేరకు ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు ఆంధ్రా కాల్వ మరమ్మతులకు తన పార్లమెంట్ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో కాల్వను సుమారు 4 కిలో మీటర్ల మేర మరమ్మతులు చేసి కాలువపై రెండు కల్వర్టులు కూడా నిర్మించారు. ఇంకా 14 కిలో మీటర్ల మేర పూడిక తీసి మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది.

దశాబ్దాలుగా నిర్లక్ష్యం

చింతలపూడి మండలం రాఘవాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో ఉన్న ఆంధ్రా కాలువ పూడుకుపోయి దశాబ్దాలు కావస్తోంది. కాలువకు అనేక చోట్ల గండ్లుకూడా పడ్డాయి. అవి పూడ్చమని ఆయకట్టు రైతులు అనేక సంవత్సరాలుగా మొర పెట్టుకుంటున్నా పూడ్చడం లేదు. దీంతో ఏటా కురిసిన వర్షాలకు వరద నీరు పంటపొలాలపై నుంచి ప్రవహించి వృథాగా పోతోంది. ఆంధ్రా కాల్వ కింద మండలంలో 21 చెరువులకు సాగు నీరు అందుతుంది. దాదాపు 15 వేల ఎకరాలు సాగు అవుతోంది. చింతలపూడి మండలం, నాగిరెడ్డిగూడెం వద్ద నిర్మించిన తమ్మిలేరు ప్రాజెక్టు సైతం ఆంధ్రాకాలువ ద్వారా వచ్చే వరద నీటిపై ఆధారపడి ఉంది. ఈ ప్రాజెక్టు కింద ఎన్‌టీఆర్ కృష్ణాజిల్లా, ఏలూరు జిల్లాల్లో అధికారికంగా 9,169 ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రాకాలువ గురించి పట్టించుకోకపోవడంతో కాలువ పూడికతేలి ముళ్ల పొదలు పెరిగి అధ్వానంగా తయారైంది. తక్షణం కాలువకు పూడిక తీసి గండ్లు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆంధ్రా కాలువ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రాకాలువ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు రూ.30 లక్షలు నిధులు మంజూరు చేసి కొంత వరకు పనులు కూడా చేశారు. ప్రస్తుతం ఆయకట్టు రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేసి మిగిలిన కాలువ పనులు కూడా పూర్తి చేయాలి.

– గిరి భోగారావు, మాజీ సొసైటీ చైర్మన్, ఆయకట్టు రైతు, చింతలపూడి

నేత్ర సమస్యలపై అప్రమత్తంగా ఉండండి



ఉచిత వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేత్ర సమస్యలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి చిన్న సమస్య తలెత్తినా వెంటనే వైద్యులతో పరీక్షలు చేయించుకుని మందులు వినియోగిస్తూ కంటి చూపును కాపాడుకోవాలని లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు సూచించారు. ఆదివారం రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు 112 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు జరిపి 11 మందిని శస్త్రచికిత్స నిమిత్తం వేమగిరి ఆసుపత్రికి తరలించారు. మరో 32 మందికి కళ్లజోళ్లను సబ్సిడీ ధరలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి పండరినాథ్, బొలిశెట్టి సురేష్ తదితరులు సేవలు అందించారు. ప్రతినెలా మూడో ఆదివారం రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని, అవసరమైనవారు వినియోగించుకోవాలని రామారావు కోరారు.